

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 2-

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

చరిత్రకెక్కిన జాతి ఆ అశ్వానిది. మేలు అరబ్బు జాతి సంతతికి సంపర్కము చేయించి పుట్టించినది. మహారాణా ప్రతాప్ అశ్వము 'చేతక్' జాతికి చెందినది. ఇప్పటికి అది కూడా నివ్వెరపాటు నుండి తేరుకుంది. తన జాతికి పుట్టుకతో వచ్చిన పోరాట పటిమను కూడగట్టుకున్నది. యజమానికోసం ప్రాణాలనివ్వడంలో పెట్టింది పేరు వాటికి. తన యజమాని నేలమీద పడిపోయిన సంగతి గమనించింది. ప్రమాదంలో చిక్కుకున్న సంగతి గుర్తించింది. దుమ్ములేపుతూ గిర్రున వెనుకకు తిరిగింది. చెవులు చిల్లులు పడేలా సకిలిస్తూ ముందుకాళ్ళు ఎత్తి ఆ సర్పము మీదకు దాడికి సిద్ధమైంది. నేలకు కూలిన ఆ మరాఠా యోధుడు మరుక్షణంలో తేరుకున్నాడు. మోకాళ్ళ మీద లేస్తూ తన ఎడమచేతిలో జారకుండా బిగించి పట్టుకున్న పిడిబాకును కుడిచేతిలోకి మార్చుకున్నాడు. దాని సహాయముతోనే పోరాటానికి సిద్ధమైనాడు.

ఖడ్గప్రహారాన్ని తప్పించుకోడానికి నేలకు జారిన ఆ మహాసర్పము నల్లని కెరటంలా ఉవ్వెత్తున లేచినదల్లా తన మీదకు దూకుతున్న అశ్వము మీదికి దృష్టి సారించింది. పడగను విసిరి దాని మెడను పట్టుకొనడానికి ప్రయత్నించింది. ఆ విసురును కాచుకోవడానికి వెనక్కు దూకినదల్లా ఒక కాలు గుండ్రని నున్నని రాతిపై పడి గిట్టల పట్టుదప్పి వెనుక కాళ్ళపై కూలబడింది ఆ అశ్వము. అక్కడితో ఎవరో ఆజ్ఞాపించినట్లు, ఏదో పాత పగ గుర్తుకొచ్చినట్లు సర్రున వెనక్కు తిరిగిందా మహా సర్పము. మోకాళ్లమీద లేస్తూ ఎదిరించడానికి సిద్ధమైన అశ్వికునిమీదికి పదిహేనుమూరల పైనుండి పిడుగులా పడగను విసిరింది కోడిపిల్ల మీదికి విసిరినట్లు. పక్కకు ఒరిగి తప్పుకోడానికి ప్రయత్నిస్తూ పెద్ద మేఘములా తన మీదికి కప్పుకుంటున్న ఆ భయంకరమైన పడగమీదికి బాకును దూశాడు మరాఠా వీరుడు. చిన్ని ఎలుకను పట్టుకునేదానిలాగా కనుగుడ్లు క్రూరముగా సంతృప్తిగా మెరుస్తుండగా దాని పడగ అతనిమీదికి కమ్ముకుంటున్న సమయములో ఆ ప్రాంతమంతా చూడశక్యముగాని దివ్యమైన కాంతి ఒకటి వ్యాపించింది. ఒక భయంకరమైన మెరుపేదో మెరిసింది.

అంతవరకూ నీడలా ఆ అశ్వికుడిని అనుసరించి వస్తున్నది తెల్లని తేజంలా, చూడడానికి వీలుగాని మెరుపులాగా ప్రకాశిస్తున్న దివ్యమైన శ్వేత సర్పం. ఒక వీచికలా గాలిలోకి ఎగిరి ముందుకు దూకింది. గుట్టలుగా కర్పూరం గుమ్మరించినట్లు ఒక అద్భుతమైన పరిమళం గుప్పుమన్నది. పది మూరలపొడవున్న ఆ శ్వేత నాగును పదిహేను మూరలకు పైననే ఉన్న కృష్ణసర్పము గమనించేలోపునే వేగముగా అశ్వికుని మీదికి వాలుతున్న నల్లని పడగను పట్టుకున్నది శ్వేతనాగు. సరిగా దాని శక్తికి నిలయమైన మర్మస్థానమును తెలిసి పట్టుకున్నట్లు బలముగా కరిచి పట్టుకున్నది. పెద్ద ఎత్తున దుమ్మురేగుతుండగా నేలకు ధ్వనులుచేస్తూ కూలిన అరటి బోదెలలా రెండూ నేలకు కూలిపోయాయి. దాని పడగను కరిచి పట్టుకున్న శ్వేత నాగు తన పట్టును సడలించలేదు సరికదా రక్తము చిమ్ముతుండగా మరింత కరిచిపట్టుకున్నది. మెలికలు తిరుగుతూ రెండూ చుట్టుకుపోయి పెనుగులాడుతూ దుమ్మురేగేట్లు పొర్లుతూ పొదలను విరుచుకుంటూ పల్లపు ప్రాంతములోకి జారిపోయాయి. గుబురైన పొదలమాటున చెట్లమాటున అదృశ్యమై పోయాయి.

తానున్న స్థితిని మర్చిపోయి, మహా భాసమానమైన ఆ తెల్లని కాంతిని చూడలేక రెండుచేతులను కనులకు అడ్డుపెట్టుకున్నాడు ఆ యోధుడు. వెనుక కాళ్ళమీద కుప్పకూలి లేచేప్రయత్నములో తలక్రిందులవుతున్న ఆ అశ్వముకూడా ఆ దివ్యమైన కాంతిని చూడలేక కనులు మూసుకుంది. అల్లంత దూరములో చేలలోనుండి కూనిరాగాలు తీస్తూ మిట్టనెక్కి బాట మీదికి వస్తున్న జానపదులు ఆ దివ్యమైన మెరుపుకు భయపడ్డారు. పిడుగు పడబోతున్నదని ఎక్కడివాళ్లు అక్కడే ఒక్క ఉదుటున నేలమీద బోర్లా పడిపోయారు. లఘుశంక తీర్చుకోడానికి ఆగి , వారి నుండి విడివడి దూరముగా ఉండిపోయిన ఒక కర్షకుడు గుర్రపు సకిలింపులను, గిట్టల చప్పుడును విన్నాడు. తీవ్రమైన వెలుగును చూడలేక రెండు చేతులతో కనులు మూసుకున్నవాడల్లా యధాలాపముగా చేతులు తొలగించి నమ్మశక్యముగాని ఒక దృశ్యమును చూశాడు.

తను చూసిన దృశ్యమును జీర్ణించుకొనక ముందే దిశలు చీలిపోయేట్లు భయంకరమైన ధ్వనితో అతనికి కొద్ది సమీపములో విశాలముగా కొమ్మలు సాచి ఎత్తుగా పెరిగిన మర్రిచెట్టు మీద పిడుగు పడింది. ఫెళఫెళమంటూ దాని పెద్ద కొమ్మలు నేలకు కూలిపోయాయి. చంద్రనిప్పులు పెట్టుకున్నట్లు రెండు కండ్లు భగభగ మండిపోతూ హృదయవిదారకముగా కేకలు పెడుతూ నేలకూలిపోయాడు. మరుక్షణంలోనే మాట పడిపోయింది. పెద్దగా అరిచి కేకలుపెట్టి తనవారిని పిలుద్దామనుకుని అతను ప్రయత్నము చేసిన కొద్దీ విచిత్రమైన ధ్వనులతో కూడిన గాలిని మాత్రమే స్వరపేటికలు వెలువరించాయి. తన చూపూ మాటా కోల్పోయిన సంగతి గ్రహించిన ఆ దురదృష్టవంతుడు స్పృహ తప్పి నేలమీదికి కుప్పకూలిపోయాడు.

అంతవరకూ హాయిగా ఎగురుతూ ఆనంద సూచకములైన ధ్వనులను వెలువరిస్తున్న పక్షిజాతులు కీచుమంటూ భయపడుతున్నట్లు ధ్వనులుచేస్తూ చెట్లకొమ్మలలో వణుకుతూ చేరిపోయాయి. ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకున్న వర్ణింప శక్యముగాని తీవ్రమైన కాంతులు ఏదో అదృశ్య హస్తము తీసేసినట్లు అణిగి పోయాయి. ఆ స్థానంలో ముసిముసి చీకట్లు ముసురుకున్నాయి. ఒక విచిత్రమైన మహా నిశ్శబ్దము అలుముకున్నది.

నెమ్మదిగా కనులకు అడ్డుగా పెట్టుకున్న చేతులను తొలిగించి చుట్టూ కలయజూడడానికి ప్రయత్నించాడు అశ్వికుడు. అంతవరకూ ఉన్న మహా ప్రకాశం అంతరించిపోవడం వలన ఒక్కసారిగా గాడాంధకారము అలుముకున్నట్టు అనిపించింది. ముసిముసి చీకట్లలో తెలిసీ తెలియని వ్యక్తుల్లాగా చుట్టూ వున్న చెట్లూ చేమలూ అస్పష్టముగా కనిపించాయి. లేచి నిలబడి, తలను విదిలిస్తూ బాధను, భయమును సూచిస్తున్న సకిలింపు ధ్వనులను వెలువరిస్తున్న తన అశ్వము కనిపించింది.

అంతవరకూ భరించలేని ప్రకాశానికి అసంకల్పితంగా కనులకు చేతులు అడ్డుపెట్టుకుని కొన్ని క్షణాలపాటు విచిత్రమైన ధ్వనులను విన్నాడు అతను. తీవ్రమైన బుసలను, నేలను యేవో బలిష్టమైన చేతులు చరుస్తున్నట్లు వెలువడిన ధ్వనులను విన్నాడు. తనకు కుడిప్రక్కన వున్న పొదలను తుప్పలను విరగదీస్తూ యేవో బరువైన ప్రాణుల కదలికల ధ్వనులను విన్నాడు. ఇంతలో భూమ్యాకాశాలను కంపింప జేస్తూ భయంకరమైన పిడుగుపాటు ధ్వనిని విన్నాడు. అనంతరం నరాలను కుంగదీసే నిశ్శబ్దము. ఆ నిశ్శబ్దము భరింప శక్యము కానిదిగా తోచి కంపిస్తున్న చేతులను కనులమీదినుండి తొలిగించి నెమ్మదిగా లేచి తన ఖడ్గమును తీసుకుని అశ్వమును సమీపించాడు. అతనిని కౌగిలించుకుంటున్నట్లు దగ్గిరికి వచ్చి మెడతో అతని చాతీని రుద్దుతూ కొద్దిసేపటికి సేద దీరింది అది. కంపించిపోతున్నది తన శరీరమా దాని శరీరమా అని సందేహము కలిగింది అతనికి ఆ క్షణములో.

కొంత దూరములో ఎడమ ప్రక్కన పల్లపు ప్రాంతములో ఏవో మూలుగులు, విచిత్రమైన ధ్వనులు వినిపించి ఖడ్గమును సిద్దముగా పట్టుకుని అటువైపు అడుగులేశాడు. అనుమానముగా చుట్టూ కలయజూస్తూ అతనిని అనుసరించింది అశ్వము. చేతికి అందే దూరములో వున్న వస్తువులు తప్ప ఏమీ కనిపించని చీకటి చుట్టుముట్టింది అప్పటికి. పొదలను వేరు చేస్తూ క్రిందికి దిగాడు. కొద్దిదూరంలో నిలువునా రెండుగా చీలిన మఱ్ఱిచెట్టు కనిపించింది. కొద్ది దూరంలో పొదలకు అడ్డంగా రెండు కనులూ మూసుకుని బాధగా మూలుగుతున్న ఆకారం పొర్లుతూ కనిపించింది. కనులు చిట్లించి చూసి అది ఒక పురుషుడి ఆకారముగా గుర్తు పట్టి సమీపించాడు.

ఆ సమయానికి ఆ పురుషాకారము కదలికలు ఉడిగిపోయి నిశ్చలమై పోయింది. నాడి చూసి, చాతీమీద చెవులు ఆనించి గుండె సవ్వడి విన్నాడు. ప్రాణమున్నది అని, పిడుగుపాటుకు స్పృహ కోల్పోయాడని గ్రహించాడు అతను. ఇప్పటికీ ఇదంతా ఒక కలగానే అనిపిస్తున్నది అతనికి. ఇప్పుడు తన పూర్తి శక్తియుక్తులూ కూడా దీసుకున్నాడు. నేలమీద పడివున్న వ్యక్తిని తన అశ్వము మీదికి సునాయాసముగా చేర్చి, కళ్ళెములను పట్టుకుని అశ్వమును బాట మీదికి ఎక్కించి, నడవసాగాడు. వేగముగా చీకట్లు ఆక్రమించుకున్నాయి. జగత్తును పూర్తిగా అంధకారము అలుముకున్నది

# – 4–

ముక్తివరం గ్రామంలో గత రెండు రోజులుగా ఎక్కడ జూసినా ఇదే చర్చ. చివరికి ఆ నోటా ఈ నోటా ఈ వార్త సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్ షా కోట వరకూ చేరింది వేగుల వారి ద్వారా. రెండు రోజులక్రితము గోధూళి వేళలో నమ్మశక్యము కాని సంఘటన జరిగింది ఆ గ్రామపు పొలిమేరలలో. కృష్ణరాయలవారు తన ఏలుబడిలోని గ్రామముల శిస్తు లెక్కలు, పరిపాలనకు సంబంధించిన ఇతర వివరాలను విన్నవించడానికి తన వ్యక్తిగత సహాయకులతో కలిసి భాగ్యనగరమునకు వెళ్ళాడు ఆ ఉదయం. అప్పటికే మధ్యాహ్నము అవుతున్నదని కొలువులోని అధికారులకు అందించవలసిన మిగిలిన వివరముల బాధ్యతను తన సహాయకులకు అప్పజెప్పి సుల్తాన్ అనుమతిని తీసుకుని వెనక్కు వస్తున్నాడుట. ధరగిరిపురమునకు, స్తంభాద్రికి, వృద్ధగిరికి దారులు తీసే కూడలి వద్దకు వస్తూ ఉండగా దాదాపు పదిహేను బారలు పొడవు, ఒక అరటి బోదె అంతటి లావు కలిగిన కాల నాగు ఆయన గుర్రమును అడ్డగించి కొస తోక మీద నిలిచి ఆగ్రహముతో బుసలు కొడుతూ కాటు వేయడానికి ప్రయత్నము చేసిందట. ఇంతలో పెద్ద పిడుగుపాటు ధ్వని వినిపించిందట.

మాగాణుల నుండి ఇళ్ళకు మరలుతున్న కర్షకులు ఉన్నట్టుండి మారిపోయిన వాతావరణం గురించి మాట్లాడుకుంటూ ఉండగానే, భయంకరమైన ఉరుముల ధ్వని వినవచ్చి, పిడుగు పడుతున్నదని భయముతో ఎక్కడి వారు అక్కడే నేల మీద బోర్లా పడిపోయారుట. సమీపములోనే చెవులు చిల్లులు పడేలా ధ్వనులతో పిడుగుపడడం, వీరికి వెనుకగా వస్తున్న వరహాల సెట్టి కుమారుడు నాగిసెట్టిమీద పిడుగుపాటుకు కూలిన చెట్టు తాలూకు పెను శాఖలు పడడం వలన తీవ్ర గాయాల పాలయినాడు, ఆ మెరుపుకాంతికి ఆ పిడుగుపాటు లోని వేడిమికి, పాపం, ఆ నూతన వరుడి రెండు కనులూ గుడ్డివి ఐపోయాయి, వినికిడి శక్తి కూడా పోయింది.

పిడుగుపాటు ఏమీ కొత్త విషయము కాదు. ఋతువు మారుతున్నప్పుడు సహజముగా వర్షముతో కొత్త ఋతువు ప్రారంభము అవుతుంది. ప్రతీ ఋతువూ వర్షముతో తీవ్రమవుతుంది. వేసవి మధ్యలో ఒక వర్షము పడిన తర్వాత వేసవి ముదురుతుంది. శీతాకలమూ అంతే. ఒక్కోసారి ఋతువుల సంధికాలము లో ఉరుములు, పిడుగులతో కూడిన ధూళి రేగడం, చిరువర్షమో పెనువర్షమో పడడం, అక్కడక్కడా దురదృష్టవంతులు పిడుగుబారినపడి అసువులు బాయడం జరిగేదే, కానీ ఆ రోజున ఒక్క చుక్క కూడా వర్షము పడలేదు. అది సరే, పొలాలనుండి వస్తున్న కర్షకులందరికీ నేలమీద బోర్లా పడుకుండిపోయినప్పుడు భయంకరమైన బుసలు వినిపించాయిట.

అందరూ చెప్తున్నమాట కనుక నమ్మవలసి వచ్చింది కానీ, అంత పెను సర్పము అప్పటికప్పుడు ఎక్కడనుండి వూడిపడుతుంది? అదే విచిత్రము అంటే, ఏవో భయంకరమైన పెనుగులాడుకున్న ధ్వనులు, ఒకటికంటే రెండు పెను జంతువులో సర్పములో చేసిన హిస హిస బుస బుస ధ్వనులు అందరికీ వినబడ్డాయిట. ఏదో అవ్యక్తమైన ఉద్విగ్నత ఒకటి అందరినీ అలుముకుని కనులు తెరిచి చూసే సాహసము కూడా చేయలేకపోయారుట. అన్ని ధ్వనులూ అణగిపోయి భయంకరమైన నిశ్శబ్దము అలుముకున్న తర్వాత కొద్దిగా ధైర్యము చేసి తలలెత్తి చూసిన వారికి ఏదో భయంకరమైన పెనుగులాట జరిగినట్టు తూర్పారబోసినట్టు ధూళి ఎగిసి కనిపించిందే తప్ప మరేమీ లేదుట. మంత్రము వేసినట్టు ఆ మహాభయంకర కాలనాగు ఎలా మాయమైంది? చిరు

వృక్షాలను, పొదలను విరగదీస్తూ ఏవో పెను జంతువులు కుమ్ములాడిన ధ్వనులు వినిపించాయిట. మరునాడు ధైర్యము చేసి ఒక బృందముగా వెళ్ళిన గ్రామస్తులకు చెల్లాచెదురుగా ఏనుగులు తొక్కినట్టు విరిగిపడి ఉన్న చెట్లు, పొదలు బాటకు ప్రక్కన కనిపించాయి, మరే ఆనవాలూ లేదు!

మహా వీరుడు, సాహసి, తను ఒక్కడే కనీసము ఎనిమిదిమంది వీరులకు బల్లెముతోనో, తన పొడవాటి ఖడ్గముతోనో సమాధానము చెప్పి, పరాజితులను జేసి శరణు చెప్పించి వదిలిపెట్టేవాడు, కృష్ణరాయలవారు. ఆయన కూడా చేతులాడకుండా నివ్వెరపోయారు అంటే ఎంత భయంకరమైన సర్పము అయివుండాలి? ఉన్నట్టుండి ఎక్కడినుండి ఎలా వచ్చింది, ఎక్కడికి ఎలా మాయమైపోయింది ఈ రెండు ప్రశ్నలు కొన్ని వందల గొంతుకలు కొన్ని వేలసార్లు వేశాయి ఈ రెండురోజుల్లో, ముక్తివరములో!

రెండురోజులక్రితం జరిగిన సంఘటనను పదేపదే ముచ్చటించుకుంటూనే సంవత్సరం క్రితము జరిగిన సంఘటనను నెమరువేసుకున్నారు. క్రిందటేడు సంగతి అది. గ్రామస్తులు శరన్నవరాత్రుల పుణ్య దినాలలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సంబరాలలో మునిగి ఉన్నప్పుడు జరిగిన కథ.

కృష్ణరాయల తండ్రి భవానీశంకర రాయలు మరాఠాల ఏలుబడి సాగుతున్నప్పుడు వారి పాలెకాడుగా కొన్నేళ్ళ క్రితం ఆ పరగణాకు వచ్చాడు. లేత తమలపాకులా ఉన్న పద్నాలుగేళ్ళ భార్యనుకూర్చోబెట్టుకుని మేనాదిగి ఊరుబయట ఉన్న మామిడితోపులో దేరా వేయించాడు. యాభైమంది రౌతులు సూర్యుడి గుర్రాల్లాగున్న మాంచి గుర్రాలనెక్కి ఆయనవెంట వచ్చారు. సూర్యుడు నడినెత్తినున్నప్పుడు మొదలెట్టి, సాయం సంధ్య సమయానికల్లా చుట్టూ కంచెను పాతించి, గ్రామస్తులకు, గ్రామపెద్దలకు కబురుపెట్టి అందరినీ పేరుపేరునా అడిగి పరిచయము చేసుకుని, చత్రపతి శివాజీ మహారాజు పంపిన ఫర్మానాను చదవమని దళ నాయకుడికి సంజ్ఞ చేశాడు. మరాఠీలోవున్నఫర్మానాను దాని తర్జుమాను చదివి వినిపించాడు ఆ దళ నాయకుడు.

ఆనాటి నుండీ మొదలెట్టి ఆయన ప్రాపకంలో తూర్పున పాలవంచ దాటి, ఆగ్నేయాన అశ్వరావుపేటను అంటి, నైరుతిలో నందిగ్రామము వరకూ తన పరిధిని విస్తరించాడు ఆయన. వచ్చిన మొదటి నాళ్లలో పాలు, పెరుగు ఇతర పదార్థాలను వనంలో ఉన్నవారి కోసం తీసుకెళ్లడంగా వ్యవహారం జరిగి, చివరికి వనంలో వారుగా, వనం వారుగా ఆయన, ఆయన వంశీకులు స్థిరపడిపోయారు. అటూ యిటూగా వందకు లోపే ఇళ్లున్న గ్రామం ముక్తివరం.

ఇళ్ళు అనడమే కానీ, అవి అన్నీ పూరిగుడిశలే! మట్టిగోడలు, వెదురు కంచెల ప్రహరీలు, వెదురు బొంగులమీద దట్టముగా ఒక్క చుక్క కూడా వర్షపు నీరు జొరబడకుండా నేర్పుగా పరచిన తాటాకులు, వెదురు గడ్డి, చొప్ప పైకప్పులుగా చేసుకున్న గుడిశెలు వారివి. విశాలమైన ఆవరణలు, నిత్యమూ ఆవుపేడతో అలికి, రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దుకుని ప్రతినిత్యమూ పెళ్లి కూతుళ్ళ లాగా కల్యాణానికి ముస్తాబై ఎదురుచూస్తున్నట్లుండే మునిముసినవ్వుల మురిపాల కన్యలవంటి లోగిళ్ళు!

బంతులు, చేమంతులు, జాజులు, గరుడ వర్ధనాలు, నందివర్ధనాలు మొదలైన పూల చెట్లు, చేమకూరల పాదులు ఒకప్రక్కన, తీగబచ్చలి పాదులు, గోగు, వంగ లాంటి యితర కూరగాయలకు పనికివచ్చే మొక్కలు ఒకప్రక్కన శ్రద్ధగా పెంచుకుంటూ ఆనందము, ఆరోగ్యము, సౌభాగ్యము కలిగిన

వారు, సంతృప్తిని కలిగినవారు ఆ పల్లెప్రజలు. ఒకరి జోలికి వెళ్ళేవారు కారు. వ్యసనాలు కలిగినవారు కారు. పగలూ రేయీ ఒళ్ళు విరుచుకుని నేలతల్లిని సేవించుకోవడం, ఆమె దయకలిగి ఇచ్చినదానితో సంతృప్తిని చెందడం వారి జీవన విధానము. గ్రామీణ క్రీడలైన కర్రసాము, కోలాటాము, చెక్కభజనలు వారి వినోదాలు. ఎప్పుడన్నా ఒకసారి స్థంభాద్రి గుట్టమీద జరిగే నరసింహుని కళ్యాణానికో, ధరగిరిపురం సంతకో వెళ్ళడం తప్ప ఊరు దాటరు, ఊరు కట్టు దాటరు, అన్నమాట దాటరు. రహస్యమేమిటంటే ఊరు కట్టు అన్నా, కట్టడిచేసే మాట అన్నా కృష్ణరాయల మాట అన్నమాట!

కృష్ణరాయలు దేవీ ఉపాసకుడు. నవరాత్రులలో నిష్ఠగా ఆహార విహారనియమాలను పాటిస్తాడు. ఆ నాటి సాయంత్రము అమ్మవారి సేవలో దేవీ అశ్వధాటి గురించి అర్చకస్వాముల కోరికపై ఆయనే ప్రసంగించాడు. ఇంటికి తిరిగివచ్చి అర్చకస్వాములు, గ్రామస్తులు అందరితో కలసి పంక్తిభోజనంలో ఏకభుక్తము ముగించాడు. ఉదయమునుండీ తనతోనే ఉన్న గ్రామ రైతులకు, యువకులకు మరునాటి అత్యవసర దైనందిక విధులను, అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన విధులను పురమాయించి పంపాడు. నేలపై మేను వాల్చి కనులు మూసుకున్న దగ్గరినుండీ కొన్ని గంటలక్రితం తను వివరించిన అశ్వధాటి వృత్తం అయన మస్తిష్కంలో కదం తొక్కసాగింది. నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు. ఆయన కనులముందు ఏవేవో దృశ్యాలు సాక్షాత్కరించాయి.

ఒక దివ్యమైన అశ్వము! పాలసముద్ర వర్ణము ధవళమా దాని మేనివర్ణము ధవళతరమా  తెలియడంలేదు. తూగులు తూగుతూ కదం తొక్కుతుంటే గాలికెగురుతున్నది దాని నోటి నురగలా, క్షీరాబ్ధి నురగలా తేలడంలేదు. ఆ గిట్టలధ్వని అలా సాగుతూ, ఎక్కడినుండో వినవస్తూ క్రమక్రమంగా దగ్గరవుతున్న అనుభూతి. ఆ అశ్వం తనమీదకు దూకుతున్నదా అన్నంతగా తనువును, మనసును, కర్ణేంద్రియమును ఆక్రమించుకుని, అంతుబట్టని ఉద్విగ్నత. ఇంతలోనే ధ్వని అణగి పోవడం, మరలా మొదలు ఎక్కడినుండో దివ్యమైన అశ్వధాటి.

ఉండగా ఉండగా ఒక దివ్యమైన పురుషాకృతి కన్పట్టింది ఆ అశ్వములో. తలవరకూ అశ్వము, దివ్యాలంకారభూషితమైన పురుష శరీరము! ఒకింత కినుకగా చూస్తున్నట్టున్న చూపులు, అంతలోనే ప్రసన్న వదనం మాలిమిగా తన శిశువును సమీపిస్తున్న అశ్వములాగా. ఆ నిదురలోనే ఆయనకు చటుక్కున హయగ్రీవస్వామి స్ఫురణకు వచ్చాడు, గాలితాకిడికో, సుడిగాలిలా పరుగెడుతున్న ఆ అశ్వధాటి తాకిడికో ఆ నోటి నురగ తనమీద పడి మాటలలో వర్ణించలేని చల్లదనాన్ని, మనసు తట్టుకోలేనంత ఆనందాన్ని అనుభవించి, తనకు తెలియకుండానే స్వామీ, దివ్యప్రభావా! ప్రోష్టీశవిగ్రహా! సునిష్ఠీవనోద్ధత విశిష్టాంబుచారి జలధే! అని స్తోత్రము ప్రారంభము ఐంది.

ఆ స్వప్నంలో తన నోటివెంట ఈ స్తోత్రము మెదులుతూనే ఉన్నది, వాదిరాజస్వామి స్తోత్రము కదూ అనుకుంటున్నాడు తనలో. ఇంతలో తీవ్రమైన గుర్రపు డెక్కల ధ్వనులు, ఏదో ఉద్విగ్నత, అరుపులు, కేకలు ఎక్కడినుండో వినబడుతున్న భావన కలిగి ఆయనకు మెలుకువ వచ్చింది.

అది అర్ధరాత్రి పన్నెండు గంటల సమయము. పాతికమంది పిండారీలు గుంపుగా గుర్రాలమీద పిడుగుల్లాగా వచ్చి లూటీకి పాల్పడ్డారు. భయంకరమైన పట్కా కత్తులు, బరిశెలు, గొడ్డళ్ళతో యముడి అనుచరుల్లాగా వూడిపడ్డారు. అంతవరకూ అమ్మవారి ఆరాధనలో మైమరచిపోయి, తీర్థ ప్రసాద వితరణ తర్వాత సంతోషముగా ఇళ్ళకు వెళ్ళిన గ్రామస్తులు ఆదమరచి నిద్రలో ఉండగా జరిగింది ఆ భయంకరమైన దాడి! ఏమి జరుగుతున్నదో తెలుసుకునేలోగానే పది ఇళ్ళు నేలమట్టమైపోయాయి.

కలలోని దివ్యాశ్వపు ధాటి, ఆ ధ్వని, ఆ స్తోత్ర నాదము స్థానములో గుర్రముల సకిలింతలు, గ్రామస్తుల ఆర్తనాదాలు, మంటల ఫెళఫెళ ధ్వనులు చెవినబడ్డాయి. సమీపంలో ఆకాశానికి అంటుతున్న మంటల కాంతి మిద్దెమీద ప్రతిఫలిస్తూ కంటబడింది. గడ్డీ గాదమూ తగులబడుతున్న వాసన నాసికకు సోకింది. అప్రయత్నముగా తలవైపు గోడకు వారగా ఉంచిన బల్లెంవైపు దూకి దానిని చేత బట్టకున్నాడు. మెట్ల జోలికి పోకుండా నిలువెత్తు అరుగున్న వాలు వసారాను, ఒక్క గంతున దూకి ప్రహరీ గోడవైపు పరుగులు పెట్టాడు.

ఎప్పటినుండో చిందులు తొక్కుతూ, సకిలింతలతో ఆయనను హెచ్చరించడానికి ప్రయత్నిస్తూ కట్లను విడిపించుకోడానికి పెనగులాడుతున్నది ఆయన మేలిమిజాతి మాలిమిగుర్రం. ఆయన వసారానుండి  దూకగానే బంధనాలు తెంచుకున్నది. గాలిలో తేలుతున్న దానిలా పాతిక ధనువుల దూరంలోని కొష్టం నుండి నాలుగే నాలుగు దూకులలో ఆయనను దాటి ముందుకు వెళ్ళింది. కదం తొక్కుతూ ముందరి రెండు కాళ్ళు ఆకాశానికి తాటిస్తూ సకిలించి, తన సంసిద్ధతను తెలియజేయడం, ఒక్క గెంతులో ఆయన దానిమూపుపై దూకడం, పదడుగుల ప్రహరీ గోడను లంఘించి అది దౌడు తీయడం మూడే మూడు ఉచ్ఛ్వాస నిశ్వాసముల సమయంలో జరిగిపోయింది.

పగలంతా వివిధ పనులలో, ఉత్సవాల ఏర్పాట్లలో, సంరంభంలో అలిసిపోయిన ఆయన సహచరులు, అంగరక్షకులు, సేవకులు పదిహేనుమంది ఆయన మిద్దె ప్రాంగణంలోనే నిదురిస్తున్నారు. ఈ కలకలం చెవినబడి, తమ కర్రలు, బరిసెలు అందుకుని పరుగులు పెడుతూ ప్రహరీ ద్వారాన్ని సమీపిస్తుండగా పొదలమాటున పొంచిన పెద్దపులిలా ప్రహరీగోడ మీదినుండి దూకుతున్న రాయలగుర్రం ఒక మెరుపులా వారి కనులముందు మెరిసి మాయమైంది. ఆ సరికి మిద్దెపైన నిదురిస్తున్న లక్ష్మీబాయి మేల్కొని, ఆమె పరిచారికలు ఆందోళనగా అనుసరిస్తుండగా కంటెగోడ వద్దకు పరుగెత్తింది. ఆమె కన్నులకు సుడిగాలిలా గ్రామ మధ్యానికి దూసుకుపోతూ గుర్రపు గిట్టల తాకిడికి రేగిన ధూళి మేఘాలలో లీలగా కనిపించి మాయమైనాడు కృష్ణరాయలు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS